క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ సరికాదు

దామెర : ఎస్సీ వర్గీకరణ లేకుండా 11,062 టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామనడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ అన్నారు. మండలంలోని పులుకుర్తిలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల పోరాటంతో సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటే, ఆ ఫలాలు మాదిగలకు అందకుండా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మాల నాయకులు బ్లాక్‌మేయిల్‌కు సీఎం భయపడుతున్నాడని అన్నారు. సీఎం వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో మాదిగ ఉపకులాలకు చెందినవారు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి స్వరాజ్, మండల ఇన్‌చార్జ్ రవికుమార్, నాయకులు రాము, రాజేష్, కమలాకర్, శ్రీధర్, మహిపాల్, ప్రశాంత్, రాజు, మొగిలి, బక్కయ్య, దినేష్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో వివాహిత మానగాని కల్యాణి (31) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన పోలు నారాయణ కూతురు కల్యాణి వివాహం నాగరాజుతో గతంలో జరిగింది. బతుకుదెరువు కోసం దంపతులు ధర్మారం వెళ్లి నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగరాజు హమాలీ పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై ఇంటిలో డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో జీవితంపై విరక్తి చెందిన కల్యాణి కిరాయికి ఉంటున్న ఇంటిలో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి పోలు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్ నగర్, దీన్‌దయాళ్ నగర్, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ శివారులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గొర్రెకుంట, కీర్తినగర్, గరీబ్‌నగర్, ప్రగతి ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అన్నప్రసాద వితరణ

కాశిబుగ్గ: 19వ డివిజన్ వివేకానంద కాలనీలో వివేకావాహిని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భక్తులకు ఆదివారం అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్లు ఓని భాస్కర్, బయ్యా స్వామి, సముద్రాల పరమేశ్వర్లను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. సమితి అధ్యక్షుడు ఊరటి రవీందర్‌రెడ్డి, ఎరుకుల రఘునారెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

వరంగల్ చౌరస్తా: డాక్టర్ మడత భాస్కర్ రచించిన 'ఓ ఆదివారం రోజున' పుస్తక ఆవిష్కరణ వర్చువల్‌గా ఆదివారం జూమ్‌లో వరంగల్‌లో జరిగింది. చక్రవర్తుల రాధాకృష్ణ సాహితి వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొట్లపల్లి శ్రీనివాస్‌రావు హాజరు కాగా, అతిథులుగా ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు, కుందావజ్జల కృష్ణమూర్తి, పిల్లలమర్రి రాములు, పరాశర భట్టర్ రఘునాథాచార్యులు, పాక రమేష్‌బాబు, మహమ్మద్ షరీఫ్ హాజరయ్యారు. డాక్టర్ మడత భాస్కర్ రచించిన పుస్తకంలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ అతిథులు ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి, మునుకుంట్ల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు పదోన్నతి

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.భాస్కర్‌కు కార్యనిర్వహణ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నుంచి ఉత్తర్వులను భాస్కర్ అందుకున్నారు. హనుమకొండలోని శ్రీరామ మందిర దేవస్థానానికి కార్యనిర్వహణ అధికారిగా నియమించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, అదనపు కమిషనర్ జ్యోతి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి పాల్గొన్నారు.

అమృత ఫలం.. సీతాఫలం

- జోరందుకున్న విక్రయాలు
- అందుబాటులో సీతాఫలాలు
- ఆసక్తి చూపుతున్న పలువురు


సీతాఫలాలను కొనుగోలు చేస్తున్న వాహనాదారులు


సీతాఫలాలు

ఎల్కతుర్తి : చలికాలం రాగానే విరివిగా లభించే ఫలాలలో సీతాఫలం ఒకటి. దీన్ని అమృత ఫలమని కూడా అంటారు. అదే విధంగా కస్టర్ యాపిల్, షుగర్ యాపిల్ అని కూడా పిలుస్తుంటారు. అయితే ఈ పండుకు గతేడాది అధిక ధరలు ఉండేవి. ఈ ఏడాది ధరలు తగ్గించి విక్రయిస్తుండడంతో సామాన్యులకు అందుబాటులో ఉందని పలువరు అభిప్రాయ పడుతున్నారు. ఈ సీజన్‌లో పండ్లు విరివిగా లభిస్తుండడంతో ధరలు తగ్గించి విక్రయాలు సాగిస్తుండడంతో సిటీకి వచ్చిపోయే వాహనాదారులు, ఎక్కువగా కార్లలో వచ్చి సీతాఫలాలు కొనుగోలు చేస్తున్నారు.

పుష్కలంగా ఔషధ గుణాలు

మధుర ఫలంగా పిలుచుకునే సీతాఫలంలో మానవ శరీరానికి మేలు చేసే అనేక రకాల ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా సీతాఫలంలో ఐరన్, పాస్పరస్, మెగ్నీషియం, విటమిన్–సీ పుష్కలంగా లభిస్తాయి. వంద గ్రాముల సీతాఫలంలో 68.6 గ్రాముల తేమ, 1.6 గ్రాముల కొవ్వు, 26.2 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2.4 గ్రాముల పీచు పదార్థాలు, కాల్షియం, విటామిన్, రైబోఫ్లోవిన్, నియాసిన్ లాంటి పోషక విలువలు ఉంటాయి.

ఈ ఫలం ఏం మేలు చేస్తుందంటే..

సీతాఫలంలో లభించే ఔషధ గుణాలు మానవాళికి అనేక రకాలుగా మేలు చేస్తాయని వైద్యులు చెబుతుంటారు. ఈ కాయ పచ్చిగా తినేందుకు అస్సలే పనికి రాదు. దీన్ని రసం రూపంలో కంటే నేరుగా తినడమే మంచిది. సీతాఫలంలోని గుజ్జు నోటిలోని జీర్ణ రసాయనాలను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియ వేగవంతమవుతుంది. కేవలం పండులోని గుజ్జే కాకుండా వాటి బెరడు, గింజలు, ఆకులు కూడా ఆరోగ్యాన్ని అందిస్తాయి. రోగనిరోధక శక్తి పుష్కలంగా ఉండే ఈ సీతాఫలంలో గర్భిణులు ఈ పండును తినడం వలన శిశువు మెదడు, నాడీ వ్యవస్థతో పాటు రోగనిరోధక శక్తి పెరిగేందుకు దోహదపడుతాయి. సీతాఫలంలో విటమిన్ బీ–6 అధికంగా ఉంటుంది. దీని వలన బ్రోంకైల్ ఇన్స్‌ఫెక్షన్ తగ్గించి ఆస్తమాను నిరోధిస్తుంది. సీతాఫలంలో మెగ్నీషియం అధికంగా ఉండడం మూలంగా హార్ట్‌ఎటాక్ రాకుండా కాపాడుతుంది. కాపర్, డైటర్‌ఫైబర్ ఉండడంతో జీర్ణ వ్యవస్థ మెరుగుపడి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. బీజీ, కొల్రస్టాల్‌ను తగ్గిస్తుంది. ఐరన్ పుష్పలంగా ఉండడంతో అనిమియాను దరిచేరనియకుండా చూస్తుంది. విటమిన్–సీ, రైబో ఫ్లోవిన్‌తో కంటి చూపును మెరుగు పరిచేందుకు దోహదపడుతుంది. మెగ్నీషియంతో కీళ్ల నొప్పులు మటుమాయం అవుతాయి. చర్మ వ్యాధులు, చర్మ క్యాన్సర్, లేజీనెస్‌ను లేకండా చురుకుగా ఉండే విధంగా పని చేస్తుంది.

దసరా, దీపావళి మధ్యలో లభిస్తాయి..

అన్నిరకాల పండ్లను మార్కెట్లో కల్తీ చేస్తున్నారని మనకు తెలుసు. కానీ కేవలం ప్రకృతి అందించే మధుర ఫలంగా, ఎలాంటి కల్తీ లేకండా సహజసిద్ధంగా లభించే పండు సీతాఫలం కావడంతోపాటు అనేక పోషక విలువలు ఉంటాయి. అందుకే ప్రజలు ఈ పండును తినేందుకు ఇష్టపడుతారు. అడవులు, గుట్టలు, బీడు భూములు, ఇంటి పెరట్లో ఎక్కడైనా పెరుగుతుంది. ఈ పండును తిన్న వెంటనే శక్తిని అందిస్తుంది. పల్లెల్లోనివారు సీతాఫల కాయలను తెచ్చుకుని మగ్గబెట్టుకుని తిన్న రోజులు గుర్తుకొస్తూ ఉంటాయి. పల్లెటూళ్లలో నుంచి ఈ కాయలను, పండ్లను సేకరించి పట్టణాల రోడ్ల వెంట విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడం చూస్తుంటాం. దసరా, దీపావళి పండుగ మధ్యలో ఈ కాయలు ఎక్కువగా కాస్తుంటాయి.

బుట్ట చొప్పున విక్రయాలు

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని పెద్ద సంఖ్యలో వ్యాపారులు సీతాఫలాన్ని గత 10 రోజులుగా విక్రయిస్తున్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు నుంచి 40 ముదిరాజ్ కుటుంబాలు సీతాఫలాల వ్యాపారం చేస్తున్నారు. వీరితో పాటు కొంత మంది పిట్టలోల్లు, లంబాడీలు సైతం ఈ పండ్లను తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. అంతకుముందు సిక్కంల రూపంలో విక్రయించే పద్ధతులు పోయి ఇప్పుడు బుట్టల్లో విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఒక్క బుట్టకు 35 నుంచి 40 కాయల వరకు అందులో ఉంచి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. కాయ క్వాలిటీని బట్టి ధరలు నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారు. అయితే రోడ్ల పక్కన మాత్రమే ఈ కాయలు లభించడంతో ద్విచక్ర వాహనాలపై, కార్లలో వచ్చి పెద్ద సంఖ్యలో సీతాఫలాలు కొనుగోలు చేస్తుండడంతో స్థానిక వ్యాపారుల పంట పండుతోంది.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సుకుమార్

కమలాపూర్ : మాదిగలను మోసంచేసిన రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే వర్గీకరణ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండకుండా మాదిగలను మోసం చేస్తూ డీఎస్సీ నియామకాలు చేపట్టడం సరికాదననారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడికి మాదిగ విద్యార్థిని, విద్యార్థులు, మాదిగ మేధావులు, మాదిగ ప్రజానీకం అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజు, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ రవీందర్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు రాజు, ప్రసాద్, నాయకులు చంద్రమౌళి, రమేశ్, రాజమల్లు, భూమయ్య, గణేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల తయారీ కేంద్రాలను తొలగించాలి


మాట్లాడుతున్న కాలనీవాసులు

వేలేరు : మండలంలోని పీచర ఉప్పలమ్మ కాలనీలో గల సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రాలను తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఉప్పలమ్మ కాలనీలోని ఇళ్ల మధ్యలో సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రాలను కొంతమంది అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకుని రాత్రి, పగలు అనే తేడా లేకుండా కొనసాగిస్తున్నారని అన్నారు. దుమ్ము, ధూళి, సౌండ్ పొల్యూషన్ ద్వారా చిన్నపిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఇటుకల తయారీకి కావల్సిన ముడి సరుకులు తేవడానికి కాలనీలోకి వచ్చే హెవీ వెహికిల్స్ వలన కాలనివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్యలో ఉన్న ఇటుకల తయారీ కేంద్రాన్ని వేరేచోటుకు తరలించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా ఇటుకల తయారీ కేంద్రాన్ని వేరే చోటుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలని వాసులు బండ్ల కనకచారి, అశోక్, వీరన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న నారాయణ

ఐనవోలు : ఈనెల 9న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన ప్రదర్శనకు యువత, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు హాజరై జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరుగకుండానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ పోస్టులకు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. దీంతో మాదిగ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. 11 వేల డీఎస్సీ ఉద్యోగాల భర్తీలో 1500 ఉద్యోగాలు ఎస్సీలకు వస్తున్నట్లు చెప్పారు. వర్గీకరణ చేయకపోవడంతో మాదిగలకు అన్యాయం జరిగి, మాలలకు లబ్ధి చేకూరుతుందని ఆరోపించారు. ప్రతి గ్రామం నుంచి మాదిగ బిడ్డలందరూ తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపాలన్నారు. వెంకన్న, కొమురయ్య, ఇస్లాంబాబు, రమేష్, వేణు, ప్రవీణ్, ఐలయ్య, యాకూబ్, అనిల్ పాల్గొన్నారు.

'నామినేటెడ్'లో మొండిచేయి..!

- ఎమ్మెల్యే నాగరాజు వైఖరిపై సీనియర్ల ఆగ్రహం?
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు
- రాజీనామా యోచనలో పలువురు

హసన్‌పర్తి: ఆత్మకూరు మార్కెట్ నామినేటెడ్ పదవుల విషయంలో ఎమ్మెల్యే వైఖరిపై సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవుల భర్తీలో తమకు మొండిచేయి చూపారని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈమేరకు ఆదివారం హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులు రహస్య ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వైఖరిపై నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది. 30 ఏళ్లుగా పార్టీలో కష్టపడిన వారికి పదవుల్లో అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆత్మకూరు మార్కెట్ కమిటీలో 18 మంది సభ్యులను నియమించగా.. ఇందులో హసన్‌పర్తి రూరల్ మండలానికి ప్రాధాన్యత ఇచ్చారు. కార్పొరేషన్‌లో విలీనమైన పది గ్రామాల సీనియర్లకు మొండిచేయి చూపారనే చర్చ జరిగింది. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇద్దరి పేర్లు ప్రతిపాదించి పంపినప్పటికీ ఆ జాబితాను చెత్తబుట్టలో వేశారని మండిపడినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అధికారింలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా కార్యకర్తలు, నాయకులకు గుర్తింపులేదని సీనియర్లు వాపోయినట్లు సమాచారం. శ్రీఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీలోనూ ఇలాగే జరిగిందనే చర్చ జరిగినట్లు తెలిసింది. గుర్తింపు లేకుంటే పార్టీలో కొనసాగడం ఎందుకుని ఓ కార్యకర్త ఆవేదన వెలిబుచ్చినట్లు తోటి కార్యకర్తలు తెలిపారు. చివరికి పత్రికా సమావేశం ఏర్పాటు చేసి పార్టీకి రాజీనామా చేయాలా? ఎమ్మెల్యే కార్యక్రమాలను బహిష్కరించాలా? అనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు..

ఇదిలా ఉండగా, పత్రిక సమావేశం నిర్వహించి ప్రకటన చేసే ముందు ఓసారి విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈవిషయాన్ని ఫోన్‌లో జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి వివరించగా.. సోమవారం ఉదయం 10.30 గంటలకు హసన్‌పర్తి మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులతో రావాలని చెప్పినట్లు సమాచారం. కాగా, జిల్లా అధ్యక్షుడి వద్ద న్యాయం జరగని పక్షంలో నేరుగా ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడితో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని సీనియర్లు నిర్ణయించినట్లు తెలిసింది.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తిరుపతి

హసన్‌పర్తి : ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామానికి చెందిన తంగళ్లపల్లి తిరుపతి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తిరుపతి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి శేఖర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతితో పాటు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మెగా హెల్త్‌క్యాంపు

పరకాల : అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ హాహాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలో ఆదివారం ఉచిత మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి బీపీ, షుగర్, ఈసీజీ వంటి ఇతర రక్త పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేశారు. వివిధ రకాల వైద్యనిపుణులు డాక్టర్ అభిలాష్, డాక్టర్ రాజ్‌కుమార్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బస్ సర్వీస్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండలంలోని గొల్లపల్లిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనుల వలన గత 20 రోజుల నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పనుల జాప్యంపై సాక్షి దినపత్రికలో ఈనెల 4వ తేదీన 'సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి' కథనానికి అధికారులు స్పందించారు. బస్సు సర్వీసును పునరుద్ధరించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

గేదె తప్పిపోయిందని ఫిర్యాదు

ఐనవోలు : గేదె తప్పిపోయిందని బాధిత రైతు కందిక రాజు తెలిపాడు. మండల కేంద్రానికి చెందిన బాధిత రైతు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే పంటపొలాల వద్ద మాచనపల్లి చెరువు సమీపంలో మూడు గేదెలను కట్టేశాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసే సరికి రెండు గేదెలు మాత్రమే ఉన్నాయి. మరో గేదె తాడు విడిపించి ఎవరో తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. గేదె కోసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే తన ఫోన్ నంబర్‌కు 9533401442 సమాచారం ఇవ్వాలని కోరాడు. గేదె ఆచూకి తెలిపినవారికి రూ.5 వేలు నగదు బహుమతి అందిస్తామని ప్రకటించాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని సాధన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ జంగా సమ్మయ్య తల్లి జంగా సాంబలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి ఆదివారం సందర్శించి ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మారేపల్లి మోహన్, నాయకులు ప్రసాద్, లక్ష్మారెడ్డి, సంపత్, పాపయ్య, సంతోష్, కరణ్‌బాబు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామంలో గల బాపూజీ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఆకునూరి రమేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అతడి కుటుంబానికి సామూహిక నిధి, విపత్ సహాయం, అభయ నిధి ద్వారా రూ.70 వేల నగదును ఆదివారం ఆ సంఘం సమితి అధ్యక్షుడు ఉస్మాన్ అందించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, మల్లాజీ, పాపారావు, విజయరావు, లింగమూర్తి, రాజేశ్వర్, విద్యాసాగర్, అమరేందర్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా భద్రయ్య

దామెర : వీరభద్రస్వామి శాలివాహన (కుమ్మర) సఘం అధ్యక్షుడిగా దామెరుప్పుల భద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో కులపెద్దల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భద్రయ్య, ఉపాధ్యక్షుడిగా దామెరుప్పుల అశోక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా శంకర్, ఐలేష్, మధుబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రోత్సవాలు


దామెర : పూజలో పాల్గొన్న యాదగిరి


పరకాలలో అన్నదానం..


ఆత్మకూరు : కూష్మాండ అవతారంలో దుర్గామాత

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో వేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం దుర్గామాత కూష్మాండ అవతారంలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

ఐనవోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు కూష్మాండదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యాహ్నికం, శ్రీసూక్త విధానంచే షోడశోపచార పూజ, శ్రీలలితా సహస్ర నామ, దేవి ఉపనిషత్ పారాయణాలు, మహానివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ప్రధాన అర్చకుడు రవీందర్ మాట్లాడుతూ.. అమ్మవారిని కూష్మాండ దుర్గగా, ఎనిమిది భుజములు ఉండడం వలన అష్టభుజి దేవిగా నాలుగో అవతారంగా కొలుస్తారని అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు కోరారు. ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పారాయణదారు, విక్రాంత్ వినాయక్‌శర్మ, అర్చకులు నందనం భాను ప్రసాద్‌శర్మ, పాతర్లపాటి నరేష్‌శర్మ, నందనం మధుశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని కనకదుర్గమ్మ మదన పోచమ్మ ఆలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా ఆదివారం లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శణమిచ్చింది. పూజల అనంతరం పరకాల వాస్తవ్యుడు కొక్కిరాల దీప్తి, రాకేష్‌రావు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరి శెట్టి సాంబశివుడు, నాగెల్లి రంజిత్, ఇంగిళి వీరేష్‌రావు, మూసినపల్లి శివప్రసాద్, కంచం రవి, సత్యం, నిఖిల్, సాయి, రాకేష్ పాల్గొన్నారు.

దామెర : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో నెలకొల్పిన అమ్మవారు శాఖంబరీ అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేపట్టారు. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, శివం ట్రస్ట్ చైర్మన్ రమణారెడ్డి, సభ్యులు అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యవర్ధన్ రెడ్డి, కుమారస్వామి, భూపాలపల్లి రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న పాస్టర్ జాన్సన్

దామెర : యువకులు మంచి నడవడిక అలవర్చుకోవాలని టీబీసీ పాస్టర్ జాన్సన్ అన్నారు. మండలంలోని పులుకుర్తిలో తెలుగు బాప్టిస్టు చర్చిలో యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు మంచి పనులు చేయాలనే సకల్పంతో ముందుకెళ్లాలని అన్నారు. వ్యసనాలకు అలువాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థి దశ నుంచే ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమాజంలో మంచి చేస్తేనే గుర్తింపు ఉంటుందన్నారు. దైవ చింతన కలిగి ఏసు ప్రభువు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈదునూరి సెహ్వాగ్, గోవిందు సిద్ధార్థ, స్వాతి, నెలవంక, సుస్మిత, కరుణాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: 56వ డివిజన్ జవహర్‌కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బైరి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎతిరాజుల సునీల్, కార్యదర్శిగా కొత్తపల్లి అమర్, కోశాధికారిగా మట్టపల్లి రణధీర్, ఉపాధ్యక్షులుగా మట్టపల్లి సాంబయ్య, కంటే సత్తయ్య, తుమ్మల శోభారాణి, ఆర్గనైజర్ సెక్రటరీలుగా పులి శ్రీనివాస్, పులి రాజేష్‌లతో పాటు ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, ఏడుగురు ముఖ్య సలహాదారులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల నాగార్జున హైస్కూల్లో 2005–2006లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. విద్యాబుద్ధులు బోధించిన పాఠశాల కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు సుమన్, ధనంజయ్, రాజశేఖర్, యుగంధర్, రజనీ, శైలజలను శాలువాతో సత్కరించి, మెమొంటో అందించారు. పూర్వవిద్యార్థులు లోకేష్, సన్నీ, ప్రవీణ్, రాజేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.